సాక్షి
జనగామ

శుక్రవారం | 7 | ఏప్రిల్ | 2023



కేఎంసీకి రీసెర్చ్ యూనిట్

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో రీసెర్చ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి కేంద్రం అనుమతితోపాటు రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. - 8లో▸



సింగిల్ పట్టి @ రూ.67వేలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తెచ్చిన సింగిల్ పట్టి రకం మిర్చి క్వింటాకు రూ.67వేల ధర పలికింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $35^0/23^0$

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.



న్యూస్‌రీల్

'కంటి వెలుగు'పై అశ్రద్ధ వద్దు

చిల్పూరు: 'కంటి వెలుగు'పై అశ్రద్ధ వద్దని జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి అన్నారు. కృష్ణాజీగూడెం పాఠశాల ఆవరణలో గురువారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం సర్పంచ్ పుట్ట అంజనీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీ నర్సింహులు, ఉప సర్పంచ్ రవి, క్యాంప్ మెడికల్ ఆఫీసర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కష్ట కాలంలో ఐఎంఏ సేవలు



జనగామ రూరల్: కరోనా కష్ట కాలంలో ఐఎంఏ డాక్టర్లు ప్రాణాలు లెక్క చేయకుండా సేవలందించారని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సంపత్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. అధ్యక్షుడు డాక్టర్ ఎ.శ్రీనివాస్, సెక్రటరీ బి.శంకర్, కోశాధికారి జె.బాలాజీ, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీకాంత్‌తోపాటు జగన్‌మోహన్‌రావు, నర్సింగ్ హోమ్ అధ్యక్షుడు రాకేష్, పుల్లారావు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు అవకాశమివ్వొద్దు

చిల్పూరు: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూ ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చేయాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. చిన్నపెండ్యాల బీవైజే గార్డెన్‌లో గురువారం భూక్య రమేష్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ చిల్పూరు క్లస్టర్-1 ఆత్మీయ సమావేశంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీపీ సరిత, సర్పంచ్‌లు కందుల రఘుపతి, అరూరి ప్రణీత, కర్ణకంటి స్వప్న, నాయకులు పొల్లపల్లి శ్రీధర్‌రావు, బాలరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

వీసీలో ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి

జనగామ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈనెల 14న హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్నామని, ప్రతి నియోజకవర్గం నుంచి 300 మంది వచ్చేలా చూడాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి మండలానికి బస్సులు నడపాలని, ఒక్కో బస్సుకు ప్రభుత్వ, పోలీస్ అధికారిని నియమించాలని చెప్పారు. అలాగే రెండో విడత గొర్రెల పంపిణీని సీఎం త్వరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీపీఓ వసంత, కమిషనర్ రజిత పాల్గొన్నారు.



జై హనుమాన్

హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు నిర్వహించారు. భజనలు, కీర్తనలతో భక్తిభావం ఉప్పొంగింది. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

- వివరాలు 9లో▸ - జనగామ రూరల్

గొర్రెల పంపిణీకి శ్రీకారం

- పెండింగ్‌లో ఉన్న మొదటి, రెండో విడత 5,329 మందికి మోక్షం
- లబ్ధిదారుల వాటా సేకరించే పనిలో నిమగ్నమైన పశుసంవర్ధక శాఖ
- యూనిట్‌కు రూ.50వేలు పెంచిన తెలంగాణ సర్కారు



జనగామ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ రెండో విడుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గొల్లకురుమల ఆర్థికాభివృద్ధి కోసం 2017 జూలైలో ఈ స్కీంను అమలులోకి తీసుకు వచ్చింది. మొదటి విడత పంపిణీ తర్వాత అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. మొదటి, రెండో విడతలో మిగిలిన గొర్రెల యూనిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో యూనిట్ల కోసం డీడీలు తీసిన లబ్ధిదారులతో పాటు ఆయా పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అర్హత కలిగిన వారికి రెండో విడతలో గొర్రెల యూనిట్లు అందించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా పరిధిలో 281 గ్రామపంచాయతీలు, 200 వరకు శివారు ప్రాంతాలు ఉన్నాయి. మెజార్టీ గ్రామాల్లో గొర్రెల పెంపకం జరుగుతోంది. 6,16,000 గొర్రెలు, 1.14 లక్షల వరకు మేకలు ఉన్నాయి. ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల యూనిట్లు ప్రకటించడంతో అర్హులైన వేలాది మంది గొల్ల, కురుమలు ముందుకు వచ్చారు. 2017లో గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం ప్రతి ఊరిలో డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో యూనిట్ ధర(20 గొర్రెలు/ఒకపోతు)కు రూ.1.25 లక్షలు కేటాయించారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించారు. జిల్లాలో మొదటి విడత 21,704 యూనిట్లు మంజూరుకాగా.. ఇందులో 10,750 మంది గొల్ల కురుమలు డీడీలు తీసి ప్రభుత్వానికి అందించారు. 10,520 మందికి యూనిట్లు పంపిణీ చేయగా.. 230 పెండింగ్‌లో ఉండిపోయాయి.

పంపిణీకి రంగం సిద్ధం

రెండో విడతతోపాటు మొదటి విడత పెండింగ్ గొర్రెల యూనిట్ల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో రెండో విడతకు 10,854 యూనిట్ల కోసం డ్రా తీశారు. ఇందులో 5,755 మందికి మాత్రమే యూనిట్లు పంపిణీ చేశారు. మిగిలిన 5,099 మంది అర్హత కలిగిన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉంచారు. అలాగే మొదటి విడత పెండింగ్‌లో ఉన్న 230 మంది ఏడాదిన్నర కాలంగా గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారు.

రూ.50వేలు పెరిగిన సబ్సిడీ..

గొర్రెల సబ్సిడీ యూనిట్ ధర రూ.1.25 లక్షలు ఉండగా.. ప్రభుత్వం మరో రూ.50వేలు పెంచి రూ.1.75లక్షలు చేసింది. ఇందులో లబ్ధిదారుడు 25శాతం అంటే రూ.43,750 డీడీ రూపంలో చెల్లిస్తే.. ప్రభుత్వం 1,31,250 కలిపి.. 21 గొర్రెలను అందిస్తుంది. ఏపీతో పాటు మహారాష్ట్ర, బీదర్ తదితర ప్రాంతాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసేలా ప్లాన్ చేస్తున్నారు. తెలంగాణలో గొర్రెల సంపదను పెంచి.. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మాంసం ఎగుమతి చేసే స్థాయికి తీసుకుపోవాలనేది సీఎం కేసీఆర్ సంకల్పం.



పక్క ఫొటోలోని గొర్రెల యజమాని పేరు కుంచాల అయిలయ్య. చిల్పూరు మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన ఈయన ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ.. దానికి అనుబంధంగా కొన్ని గొర్రెలు, మేకలను పెంచుతున్నాడు. సబ్సిడీపై గొర్రెల యూనిట్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మొదటి, రెండో విడతలో అవకాశం వచ్చింది. అయితే మొదటి విడతలో సబ్సిడీ గొర్రెల యూనిట్ పొందలేక పోయాడు. రెండో విడతలో అర్హత సాధించినా.. మిగిలిన వారికి యూనిట్ ధర పెంచి గొర్రెల యూనిట్లు ఇస్తామని సర్కారు చెప్పడంతో అయిలయ్య సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

జిల్లాలో సొసైటీలు

మండలం	సొసైటీలు
బచ్చన్నపేట	22
చిల్పూరు	13
దేవరుప్పుల	16
జనగామ	18
కొడకండ్ల	11
లింగాలఘణపురం	19
నర్మెట	10
రఘునాథపల్లి	22
పాలకుర్తి	21
స్టేషన్‌ఘన్‌పూర్	14
తరిగొప్పుల	10
జఫర్‌గఢ్	17

డీడీలు తీసుకుంటాం..



జిల్లాలో మొదటి, రెండు విడతల్లో కలుపుకుని 5,329 మందికి గొర్రెల యూనిట్లు అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు 16,275 మందికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేశాం. ప్రభుత్వం పెంచిన సబ్సిడీ ఆధారంగా డ్రాలో అవకాశం పొంది, అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకుటాం. ఇందుకు సంబంధించి ఊరూరా గొల్ల, కురుమలకు అవగాహన కల్పిస్తాం.

- డాక్టర్ ఎస్ఎల్.మనోహర్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

ధాన్యం సేకరణకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: యాసంగి ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి రైస్ మిల్లర్లు, ప్యాడీ కాంట్రాక్టర్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా 200 సెంటర్లు ఏర్పాటు చేశామని, ఇందులో 111 ఐకేపీ, 89 పీఏసీఎస్ కేంద్రాలున్నాయని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని, 32 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అంచన ప్రకారం యాసంగి దిగుబడి 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, బాయిల్డ్, రా రైస్ మిల్లులు లోడింగ్ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తకుండా లారీలకు నంబర్లు కెటాయించాలని, ధాన్యం కొనుగోలు చేసిన తరువాత రైతులకు రశీదు ఇవ్వాలని చెప్పారు. ధాన్యం సేకరణలో సమస్యల పరిష్కారానికి, ఫిర్యాదు చేయడానికి కంట్రోల్ రూం 6303928718 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీసీఎస్ఓ రోజారాణి, డీఎం సంధ్యారాణి, వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రాయితీని వినియోగించుకోవాలి

- సీజీఎం(ఎంఆర్‌టీ) అశోక్‌కుమార్



విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయిస్తున్న అశోక్‌కుమార్

కొడకండ్ల: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగించుకొవాలని సీజీఎం(ఎంఆర్‌టీ) అశోక్‌కుమార్ కోరారు. మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం ఆయన ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి మీటర్లు లేనివారికి బిగించి విద్యుత్ సరఫరా తీరును తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం నెలకు 101 యూనిట్లు ఉచితంగా సరఫరా చేస్తున్న విషయమై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నెలలో స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధి ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు రాయితీ కింద రూ.82 లక్షలు మంజూరు చేశామని, మీటర్లు ఉన్న వారు మీ సేవ కేంద్రం ద్వారా పొందిన కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత ఏఈ కార్యాలయాల్లో అందించాలని చెప్పారు. మీటర్లు లేని వారు కుల ధృవీకరణ పత్రాలు తీసుకొని రూ.1,050 చెల్లించి మీటర్లు పొందితే రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశం నెలాకరు వరకు మాత్రమే ఉందని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన 45 మంది ముందుకొచ్చి డబ్బులు చెల్లించగా వారికి మీటర్లు బిగించినట్లు అశోక్ వివరించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆపరేషన్ డీఈ హూస్సేన్‌నాయక్, ఎస్ఈ ఆపరేషన్ వేణుమాధవ్, ఏడీఈ శ్రీధర్, ఏఈ రాములు, సబ్‌ఇంజనీర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఆంజనేయులు



సదస్సులో మాట్లాడుతున్న ఆంజనేయులు

జనగామ: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు విధిగా పాటిస్తే రోగాలు దరిచేరవని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.ఆంజనేయులు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమకు దూరమవుతున్నామని అన్నారు. తప్పనిసరిగా వ్యాయామం చేయడంతోపాటు సేంద్రియ ఆహార పదార్థాలు, పండ్లు, ఆకు కూరలు తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను వీలైనంత వరకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసారావు, వైద్యులు మహేష్‌కుమార్, ఆంజనేయులు, చీఫ్ లీగల్ అడ్వయిజర్ కౌన్సిల్ ఎం.రవీందర్ పాల్గొన్నారు.

బీటీ రణదివె స్ఫూర్తితో ఉద్యమించాలి



రణదివె చిత్రం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ రూరల్: కార్మికఉద్యమ నేత బీటీ రణదివె స్ఫూర్తితో ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. గురువారం రణదివె వర్ధంతిని పురస్కరించుకొని యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో రణదివె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘం స్థాపనకు విశేష కృషి చేసిన ఆయన.. కార్మికుల హక్కులను కాపడాలని అనేక పోరాటాలు చేశారని చెప్పారు. మరణం వరకు కార్మికుల పక్షాణ నిలబడి ఉద్యమించిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, కోశాధికారి విజేందర్, మల్లేష్, రాజు, రాములు, సమ్మయ్య పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణలో టెన్త్ పరీక్షలు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నాయని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. గురువారం నిడిగొండ, నెల్లుట్ల సెంటర్లను తనిఖీ చేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకున్నామని, సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించి జిరాక్స్ సెంటర్‌లను మూసివేయించి పోలీసు సిబ్బందితో నిరంతరం భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. ఇతరులను పరీక్ష కేంద్రాల వద్దకు అనుమతించకుండా అవసరమైన చర్యలు చేపట్టామని, రోజూ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. నర్మెట్ట, తరిగొప్పుల సెంటర్లను స్టేట్ అబ్జర్వర్ విజయలక్ష్మిబాయి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ రాము తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం జెడ్పీఎస్ఎస్ సెంటర్‌ను ఏసీపీ రఘుచందర్, సీఐ రాఘవేందర్ గురువారం సందర్శించారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు.

నిబంధనలు విస్మరిస్తే కఠిన చర్యలు

దేవరుప్పుల: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం, కామారెడ్డిగూడెం హైస్కూల్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న దశమంతరెడ్డి

జనగామ రూరల్: రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన సాగుతోంది.. దీనిని అంతమొందించడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసి కుర్చీకోసం పాకులాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడటానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ పాపారావు, కేఈవీఎల్ ఎస్.రెడ్డి, ఉడుగుల రమేష్, ముక్కెర తిరుపతిరెడ్డి, ప్రేలతారెడ్డి, శివరాజ్, మహిపాల్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.30వేలు చెల్లించాలి

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్‌రెడ్డి



సమవేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: ఐదుగురు మంత్రుల కమిటీ సిఫార్సు ప్రకారం రేషన్ డీలర్లకు కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శ్రీసోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన సంఘం మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. డీలర్లకు మూడు నెలలుగా కమీషన్ రాకపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదాం నుంచి బస్తాకు మూడు, నాలుగు కిలోల బియ్యం తక్కువ వస్తుండడంతో విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. డీలర్లకు హెల్‌కార్డులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మోహన్, డివిజన్ అధ్యక్షుడు జి.మొగిలి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.



జనంలో కూర్చుని 'బలగం' వీక్షణ

చిల్పూరు మండలం పల్లగుట్ట గ్రామంలో గురువారం రాత్రి బలగం సినిమాను గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రదర్శించారు. చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాజయ్య రాత్రి 9 గంటలకు అక్కడికి చేరుకున్నారు. కుర్చీలు వేయించగా జనంతో కలిసి 'బలగం' సినిమా చూస్తానంటూ.. మంది మధ్యలో కూర్చుని తిలకించాడు. - చిల్పూరు

జనగామలో విషాదఛాయలు



అంతిమయాత్రకు తరలివచ్చిన జనం

- ఎస్సై దంపతుల ఆత్మహత్యను నమ్మలేకపోతున్న స్థానికులు
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిలువెత్తు నిదర్శనం ఎస్సై శ్రీనివాస్
- అంతిమయాత్రకు తరలివచ్చిన జనం



ఎస్సై దంపతుల మృతదేహాలు

జనగామ: ఎస్సై కాసర్ల శ్రీనివాస్, భార్య స్వరూప మృతితో జనగామ పట్టణంలో విషాదం నెలకొంది. 2015 నుంచి పట్టణంలో విధులు నిర్వహిస్తూ శాంతి భద్రతల పరిరక్షిస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంతోపాటు విధి నిర్వహణలో ఉన్నతాధికారుల మెప్పు పొందేవారు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు జనగామ పట్టణంతో ఎంతో అనుబంధం కలిగి ఉన్న ఆయన.. ఏ బాధ్యతలు అప్పగించినా చాలా చాకచక్యంగా నిర్వహించేవాడనే పేరుంది. పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల నుంచి ముఖ్యంగా భార్యాభర్తల గొడవలతో స్టేషన్‌కు వచ్చిన వారికి కౌన్సింగ్ ఇచ్చి ఎన్నో కుటుంబాలను నిలబెట్టాడని గుర్తు చేసుకుంటున్నారు. ఎస్సై దంపతుల మృత దేహాలతో ఏరియా ఆస్పత్రి నుంచి చౌరస్తా వరకు జరిగిన అంతిమయాత్రలో అభిమానులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు వందలాదిగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. అనతరం అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామమైన గోదావరిఖనికి తీసుకెళ్లారు.

కన్నీరు పెట్టించిన కుటుంబ సభ్యుల రోదన

ఆస్పత్రి వద్ద మార్చురీలో ఎస్సై శ్రీనివాస్ దంపతుల మృతదేహాల వద్ద తల్లి, అత్త, ఇద్దరు కుమారులు విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టించింది. పోలీసు శాఖలో శ్రీనివాస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు పోలీసు సిబ్బంది కూడా కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సైతం అయ్యో సారూ.. అంటూ బోరుమన్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పలువురి పరామర్శ

ఆత్మహత్య చేసుకున్న దంపతుల మృతదేహాల వద్ద వరంగల్ పోలీస్ కమిషన్ ఏవీ.రంగనాథ్ నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పోలీస్ శాఖ పరంగా అందాల్సిన సహకారం అందుతుందని ధైర్యం చెప్పారు. అలాగే జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, డీసీపీ సీతారాం, ఏసీపీలు రఘుచందర్, దేవేందర్‌రెడ్డి, ట్రెయినీ అంకిత్‌కుమార్, శంకర్ పలువురు పరామర్శించారు.

ఎంత చెప్పినా తక్కువే..

ఎస్సై శ్రీనివాస్ మంచి తనం గురించి ఎంత చెప్పినా తక్కువే.. తాను ఎస్సై అనే ఫీలింగ్ లేకుండా నాయకులైనా, సామాన్యులనైనా అన్నా.. తమ్మీ అంటూ ఏంటీ సమస్య అని పలకరించి పరిష్కారం చేసేటోడు. కుటుంబంలో కూడా అందరితో కలిసి మెలిసి ఉండే తత్వం ఆయనది. ఇలా చనిపోతాడని ఎన్నడూ ఊహించలేదు.

- జక్కుల వేణుమాధవ్, కౌన్సిలర్, జనగామ

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడి మృతి



ఘటనా స్థలిలో ప్రసన్నకుమార్ మృతదేహం

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి శివారులో చెట్టుకు బైక్ ఢీకొని అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందాడు. వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని పుప్పాలగుట్టకు చెందిన అప్పికట్ల ప్రసన్నకుమార్(28) జిమ్ కోచ్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి అతడు నల్లబెల్లి శివారులో తన బైక్‌తో చెట్టుకు ఢీ కొనగా పక్కనే ఉన్న కల్వర్టులో పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్తి అమ్మకం విషయంలో జరిగిన తగాదాలతోనే ప్రసన్నకుమార్‌ను మార్టిన్ లూథర్, సర్వే వెంకన్న, బస్వ రాజ్‌కుమార్, హెర్నార్డ్, శిరీష, జిమ్ ప్రవీణ్ హత్య చేసి కల్వర్టులో పడేశారని మృతుడి అక్క ప్రభావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆస్తి తగాదాలకు సంబంధించి గతంలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నడుస్తోందని, ఈ విషయమై సీపీని కలిసినట్లు మృతుడి అక్క తెలిపింది. కాగా.. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా.. వరంగల్–ఖమ్మం రహదారిపై వాహనాన్ని ఆపి మృతుడి బంధువులు ధర్నా చేశారు. వర్ధన్నపేట ఎస్సైలు రామారావు, మంగ మృతుడి బంధువులకు సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

కొట్టుకొచ్చిన మృతదేహం

- మృతుడు హనుమకొండ వాసిగా గుర్తింపు

కేసముద్రం: హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన కొండ్ర సురేశ్(44) మృతదేహం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాం తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో గురువారం కొట్టుకొచ్చింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆతర్వాత కనిపించకుండా పోవడంతో బంధువులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో సురేశ్ అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఎస్సారెస్పీ కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం భుక్యారాం తండా సమీపంలోని డీబీఎం 48 ఎస్సారెస్పీ కాలువలో వంతెన పిల్లర్‌కు తట్టుకుని ఆగింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కాగా.. తమకు అందిన సమాచారం మేరకు మృతుడు హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్ అనే వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కేయూ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా.. సురేశ్ చింతగట్టు వద్ద ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్సై తెలిపారు.

కేఎంసీకి రీసెర్చ్ యూనిట్

- అనుమతిస్తూ రూ.1.25 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- మరో మైలురాయికి చేరుకున్న మెడికల్ కళాశాల
- ఏడాదిన్నరగా చేసిన కృషికి ఫలితం దక్కింది : ప్రిన్సిపాల్ మోహన్‌దాస్
- ఇటీవల రీజినల్ శిక్షణ కేంద్రానికి అనుమతి, సూపర్ స్పెషాలిటీ సీట్ల కేటాయింపు



ఎంజీఎం: వరంగల్ నగరంలోని కాకతీయ ప్రభుత్వ మెడికల్ కళాశాల (కేఎంసీ) మరో మైలురాయిని అధిగమించింది. 15 రోజుల క్రితం రీజినల్ శిక్షణ కేంద్రం ప్రారంభానికి అనుమతులు రాగా, వారం రోజుల క్రితం సూపర్ స్పెషాలిటీ సీట్లు సాధించుకుంది. ఈ క్రమంలోనే తాజాగా రీసెర్చ్ యూనిట్ ప్రారంభానికి కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. పదిహేను రోజుల వ్యవధిలో మూడు ప్రత్యేకతలను సాధించుకోవడంతో కేఎంసీ అధికారులు, సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ మెడికల్ కాలేజీకి 2007లో రీసెర్చ్ యూనిట్ మంజూరు చేయాలని అప్పటి ప్రిన్సిపల్ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఆ తరువాత విషయం మరుగునపడింది. ఏడాదిన్నర కాలం నుంచి కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ రీసెర్చ్ యూనిట్ మంజూరు కోసం చేసిన విన్నపం ఎట్టకేలకు ఫలించింది. కేంద్రప్రభుత్వం రూ.1.25 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడానికి అనుమతినిస్తూ గురువారం కాలేజీకి ఉత్తర్వులు అందజేసింది. ఢిల్లీలోని ఐసీఎంఆర్ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం ఈ రీసెర్చ్ యూనిట్‌లను దేశవ్యాప్తంగా ఐదు మంజూరు చేయగా అందులో ఒకటి సిద్దిపేట మెడికల్ కళాశాలకు, మరోటి కేఎంసీకి దక్కింది.

15 రోజుల వ్యవధిలో రెండు ప్రత్యేక అనుమతులు

కాకతీయ మెడికల్ కళాశాలలో నెల్స్ (నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు) పథకంలో భాగంగా నెలరోజుల్లో రీజినల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి పూర్తిస్థాయి అనుమతులు లభించి 15 రోజులు గడవకముందే రీసెర్చ్ సెంటర్ మంజూరుపై వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్స్ శిక్షణ కేంద్రం ప్రస్తుతం ఒక్క ఉస్మానియా మెడికల్ కళాశాలలో కొనసాగుతుంది. ఈనేపథ్యంలో ఇలాంటి శిక్షణ కేంద్రాన్ని వరంగల్ లోనే ప్రారంభించాలని సంకల్పించి రూ.1.50 కోట్ల పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి కేఎంసీకి చేర్చింది. అంతేకాకుండా ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై వైద్యసిబ్బంది, వైద్యులకు అందించే ఈ శిక్షణ కార్యక్రమాలపై 16మంది ప్రొఫెసర్ స్థాయి వైద్యులకు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వస్తే ఆకస్మికంగా కుప్పకూలే వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వైద్యులు జరిపే పరిశోధలకు పూర్తిస్థాయిలో సహకరించే విధంగా రీసెర్చ్ కేంద్రాన్ని సైతం కేఎంసీకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి వైద్యవిద్యార్థుల విద్యబోధనలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కాగా, వారం రోజులక్రితం ఐదు సూపర్‌స్పెషాలిటీ సీట్లు, ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు సాధించకోవడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఏడాదిన్నర కృషికి ఫలితం



ఏడాదిన్నర కృషి ఫలితంగా కేఎంసీకి రీసెర్చ్ సెంటర్ మంజూరైంది. ఇక్కడ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుకు 2007లో ఐసీఎంఆర్‌కు అప్పటి ప్రిన్సిపాల్ దరఖాస్తు చేశారు. కొన్ని కారణాల వల్ల దానిని తిరస్కరించారు. 2021 జూన్ నెలలో కేఎంసీ బోధన సిబ్బందితో సైంటిఫిక్ కమిటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అడిగిన అన్ని రకాల నివేదికలను సమర్పించాం. వాటిని పరిశీలించిన కేంద్రం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.కోటితో రీసెర్చ్ యూనిట్ సంబంధించిన పరికరాలు, రూ.25 లక్షలతో సివి ల్ పనులు చేసుకోవడానికి అనుమతినిచ్చింది. ఈ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుతో కేఎంసీ, ఎంజీఎంలోని వైద్యులు, వైద్యసిబ్బందికి వివిధ కోర్సుల్లో పరిశోధనలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

‘ఎస్సై’ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్



వరంగల్ క్రైం: ఈనెల 8,9 తేదీల్లో పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్సై (సివిల్/ఏఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఏఆర్ సిపియల్/ఫైర్) అభ్యర్థులకు జరగనున్న రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, రాత పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. ఎస్సై అభ్యర్థుల రాత పరీక్ష కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రెండ్రోజులపాటు నిర్వహించనున్న ఈరాత పరీక్షల్లో నాలుగు పేపర్లు రాత పరీక్షను నిర్వహిస్తామని, ఈ రాత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు 14,380 మంది అభ్యర్థులు హాజరవుతుండగా.. ఇందులో 3,315 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు.

అభ్యర్థులకు ముఖ్య సూచనలు..

- అభ్యర్థి ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- అభ్యర్థి వెంట హాల్‌టికెట్ తెచ్చుకోవాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దు.
- ఓఎంఆర్ షీట్‌పై అనవసర సమాచారం, గుర్తులు, మత పరమైన చిహ్నాలు రాయకూడదు.
- అభ్యర్థులు మెహందీ, సిరా మొదలగునవి వారివారి చేతులపై గాని పాదాలపై గానీ రాసుకుని రాకూడదు.

ఆలిండియా పోటీలకు సాఫ్ట్‌బాల్ జట్టు



జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: పంజాబ్ యూనివర్సిటీలో ఈనెల 5న ప్రారంభమై 9వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టును ఎంపిక చేసి పంపినట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. జట్టులో ఆర్.గంగరాజు, పి.మనోహర్, బి.నవీన్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), బి.సర్దార్, ఎం.అజయ్ (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ), జి.అన్వేశ్, బి.రాజశేఖర్, వి.అజిత్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎస్.తరుణ్ (కిట్స్ వరంగల్), బి.ప్రవీణ్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట), బి.భరత్, ఎం.విక్రమ్, ఎస్.సంతోశ్ (వీసీపీఈ బొల్లికుంట), ఎల్.కళ్యాణ్ (యూపీసీఈ కేయూ, ఖమ్మం), జి.చరణ్‌తేజ, కె.రాజశేఖర్ (ఎస్‌వీఎస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ) ఉన్నారు. జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా హనుమకొండ జిల్లా భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫిజికల్ డైరెక్టర్ ఎ.రవికుమార్ వ్యవహరిస్తున్నారు.

18న రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు



కలెక్టర్‌తో రోషన్ స్వాయ్

ములుగు: ఈనెల 18న ప్రపంచ గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వరంగల్ మేనేజర్, డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ రోషన్ స్వాయ్ అన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.కృష్ణ ఆదిత్యని రోషన్ స్వాయ్, టి.బుచ్చయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈనెల 18న ఇంటర్నేషనల్ మోనుమెంట్స్, సైట్స్ వరల్డ్ హెరిటేజ్ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరగనున్న ఉత్సవాలపై కలెక్టర్‌తో వారు చర్చించారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

గీసుకొండ: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన కూనమల్ల భిక్షపతి(48) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్షపతి అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడేళ్ల నుంచి సాగు పెట్టుబడులకు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, పెట్టిన పెట్టుబడి రాక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆటోలో వచ్చి ఇంటిముందు పడిపోయాడు. విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

ఆ వాల్ పోస్టర్లు నకిలీవే..

- ప్రకటించిన మావోలు



మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

ఏటూరునాగారం: ఈనెల 3న మండల కేంద్రంలోని చేపల మార్కెట్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీకి వేసిన వాల్ పోస్టర్లు నకిలీవని, తాము వేయలేదని మావోయిస్టు పార్టీ జయశంకర్ మహబూబాబాద్, వరంగల్ పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం లేఖలో పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రాంతంలో అధికార పార్టీ, ఇతర పేర్లతో కొన్ని పోస్టర్లు వేశారని, వాళ్లు కొంత మంది ప్రజావ్యతిరేకులు కూడా ఉన్నారని తెలిపారు. అయితే ఆ పోస్టర్లకు తమకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. అవి నకిలీ పోస్టర్లని, కొంత మంది వ్యక్తిగత కారణాలతో వాటిని వేశారని, ఆ పోస్టర్లు వేసి పార్టీని తిరగనివ్వద్దని పోలీసులే వాటిని వేయించారని లేఖలో పేర్కొన్నారు. అందుకోసం వాటిని ఎవరు నమ్మొద్దని మావోయిస్టు వెంకటేశ్ తెలిపారు.

సింగిల్ పట్టి @ రూ.67 వేలు



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

మార్కెట్‌లో మిర్చి ధరలు ఇలా..

రకం	గరిష్ట	కనిష్ట	మోడల్
తేజ	23,300	17,000	21,000
వండర్‌హాట్	36,000	31,000	33,000
యూఎస్–341	22,500	17,000	20,000
డీడీ	22,500	17,000	20,000
దీపిక	31,000	22,000	27,000
దేశీ	70,000	45,000	65,000
సింగిల్‌పట్టి	67,000	45,000	60,000
1048	23,500	16,500	21,000
తాలు	9,000	5,000	7,000

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన మిర్చి రకాల్లో సింగిల్ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాలుకు రూ.67 వేలు ధర పలికింది. ఈ సీజన్ ప్రారంభమైన తర్వాత సింగిల్ పట్టి రకానికి మొదటిసారి మార్చి 29న గరిష్టంగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. అప్పటి నుంచి రూ.60 నుంచి 65 వేల వరకు ధరలు పలికిన సింగల్ పట్టికి గురువారం రోజున మరోసారి గరిష్ట ధరగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. తేజ రకం మిర్చి ధరలు గత వారం ఉన్న విధంగానే ఉండగా.. వండర్‌హాట్ రూ.500లు, యూఎస్–341 రూ.300లు, దీపిక రూ.1,500లు, సింగిల్‌పట్టి రూ.3వేలు, 1,048 రకానికి రూ.1,500లు క్వింటాలుకు పెరిగినట్లు మిర్చి యార్డు అధికారులు తెలిపారు. మార్కెట్‌కు సుమారు 35 వేల వరకు మిర్చి బస్తాలు యార్డుకు వచ్చినట్లు తెలిపారు.

‘సీసీ’లో చిక్కకుండా చోరీ!

- బయ్యారం పీహెచ్‌సీలో రూ.65 వేల వస్తువుల అపహరణ



చోరీకి గురైన వస్తువుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ రమాదేవి

బయ్యారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. 24 గంటల పాటు రోగులకు ప్రాథమిక వైద్యం అందించే పీహెచ్‌సీలో బుధవారం రాత్రి ఇద్దరు ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత వాళ్లు లోపల గడియ పెట్టుకొని నిద్రపోయారు. ఈసమయంలో పీహెచ్‌సీలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు పీహెచ్‌సీ ఆవరణలోని సీసీ కెమెరాకు చిక్కకుండా లోపలికి చొరబడ్డారు. సిబ్బంది నిద్రిస్తున్న గది తలుపులకు బయటి నుంచి గడిపెట్టి పీహెచ్‌సీలో ఉన్న 15 వేల విలువైన నాలుగు బ్యాటరీలు, సెటాప్‌బాక్స్, రెండు డోర్‌కర్టెన్స్, ఒక కంప్యూటర్ కీ బోర్డును ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున నిద్రలేచిన ఉద్యోగులు లోపలి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా.. గడియ పెట్టినట్లు గుర్తించి స్థానికులను పిలిచి బయటకు వచ్చారు. ఘటనాస్థలాన్ని సీఐ బాలాజీ, ఎస్‌ఐ రమాదేవి పరిశీలించారు. కాగా.. పీహెచ్‌సీలో చోరీకి గురైన వస్తువుల విలువ రూ.65 వేలు ఉంటుందని పీహెచ్‌సీ వైద్యులు సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య గొంతు నులిమి చంపిన భర్త అరెస్ట్



హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో మూడెత్తుల లక్ష్మిని గొంతు నులిమి హత్య చేసిన కేసుల్లో భర్త మూడెత్తుల రమేశ్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాటారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్ మాట్లాడుతూ.. లక్ష్మి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతోనే ఈనెల 5న ఉదయం 4గంటల సమయంలో గొంతు నులిమి చంపినట్లు తెలిపారు. రమేశ్ గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు ఆయన వెల్లడించారు. నేరం ఒప్పుకోవడంతో స్టేట్‌మెంట్ రికార్డు చేసి జ్యూడీషియల్ రిమాండ్ నిమిత్తం భూపాలపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు వెల్లడించారు. ఆయన వెంట కాటారం సీఐ రంజిత్‌రావు, మహా ముత్తారం ఎస్సై సుధాకర్, కానిస్టేబుల్స్ హరికుమార్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



తిరుపతయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. గురువారం తెల్లవారుజామున మండలంలోని తాటికొండకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అక్కినపెల్లి తిరుపతయ్య (98) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామానికి చేరుకుని తిరుపతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

సాయుధ పోరాట యోధుడు

తిరుపతయ్య ఆరోజుల్లో భూస్వాముల ఆగడాలు, నిజాం నిరంకుశ పాలన, కాశీమ్ రజ్వీ పోలీసులు పేద ప్రజలపై చేసే ధన, మాన, ప్రాణ దోపిడీ చూసి చలించి పెండ్యాల రాఘవారావు దళంలో మొదట సభ్యుడిగా చేరాడు. అనంతరం దళ నాయకుడిగా కొనసాగారు. రోజంతా దళ సభ్యులతో గుట్టల్లో, పొదల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులపై దాడి చేసేందుకు ప్రణాళికలు రూపొందించేవాడు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన తిరుపతయ్య ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేవాడు. అనంతరం వరంగల్, ఖమ్మం, గుల్బర్గా, జాల్నా జైళ్లలో జైలు జీవితం అనుభవించాడు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత సీపీఐ, సీపీఎంలో పని చేశాడు.

పలువురి సంతాపం

తిరుపతయ్య మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని పార్థివదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపారు.

వడదెబ్బతో ఒకరు..




సత్యనారాయణ మృతదేహం

వెంకటాపురం(కె): వడదెబ్బ తగిలి ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధి అంకన్నగూడేనికి చెందిన గట్టు సత్యనారాయణ (55) మృతి చెందాడు. సత్యనారాయణ గురువారం మిర్చి తోటలో కూలీలతో పని చేయిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయాడు. గమనించిన కూలీలు సత్యనారాయణను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.

భారతీయత మనల్ని కలుపుతుంది

- సినీ హీరో పవన్ కల్యాణ్
- నేటి నుంచి నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలు



నిట్ క్యాంపస్‌లో మాట్లాడుతున్న సినీ హీరో పవన్ కల్యాణ్

కాజీపేట అర్బన్: ‘కళలకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లుకు కోటి దండాలు. హలో నిట్ వరంగల్. మీదే ఈ తరం’ అంటూ ప్రముఖ సినీహీరో పవన్ కల్యాణ్ యువతలో జోష్ నింపారు. నిట్ వరంగల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–23 ప్రారంభోత్సవానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్‌స్ప్రీ–23 కల్చరల్ ఫెస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఏకశిలా నగరానికి, రాణి రుద్రమదేవి పాలించిన, పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ, భాగవతం రచించిన బమ్మెర పోతన నడియాడిన ఓరుగల్లుకు రావడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లోని సంస్కృతీసంప్రదాయాలు భారతీయతలోని ఏకత్వం మనల్ని కలుపుతుందని, ఇందుకు నిదర్శనమే నాటు నాటు పాట ఆస్కార్ సాధించడమని పేర్కొన్నారు. నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్ మనల్ని కలిపిందన్నారు. ‘నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్ స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలకు అతిథిగా పిలవగా.. నేను రెగ్యులర్ కళాశాలకు వెళ్లిన విద్యార్థిని కాదు, బాగా చదువుకోలేదు. కానీ నిత్యపఠనం చేసే విద్యార్థిని, నేను మీ కళాశాలకు రావడానికి అర్హుడినా?’ అని అడిగానన్నారు. ‘జీవితంలో షార్ట్‌కట్స్ వెతుకోవద్దు అపజయాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలి’ అని అన్నారు. కార్యక్రమంలో నిట్‌డైరెక్టర్ ఎన్వీ రమణారావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.